క్లుప్తంగా

కలెక్టర్‌కు వినతి



కలెక్టర్‌కు వినతి పత్రం అందజేస్తున్న లైబ్రరీ విద్యార్థులు

నల్లగొండ టౌన్: పెద్దవూర మండలం సంగారం గ్రామంలో తన భూమిని ఆక్రమించుకున్నారని, వారికి నకిలీ పాస్ పుస్తకం ఇచ్చిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం సంగారం గ్రామానికి చెందిన వి.రామచంద్రయ్య ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ విషయమై స్థానిక తహసీల్దార్‌కు ఫిర్యాదు చేయడంతో నకిలీ పాస్ పుస్తకం అని తేల్చారని పేర్కొన్నారు. పోలీసులకు తహసీల్దార్ ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని వివరించారు.

‘ఈడబ్ల్యూఎస్‌తో బీసీ, ఎస్టీ, ఎస్సీలకు తీవ్ర అన్యాయం’

రామగిరి(నల్లగొండ): ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ వల్ల బీసీ, ఎస్టీ, ఎస్సీ వర్గాల యువతకు తీవ్ర అన్యాయం జరుగుతోందని లైబ్రరీ విద్యార్థులు సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్‌కు శాస్త్రీయత లేదని, కుల గణన జరిపి వాటా ప్రకారం రిజర్వేషన్లను కేటాయించాలని కోరారు.

మున్సిపల్ కార్మికులకు సన్మానం

చిట్యాల: మున్సిపాలిటీలో పనిచేస్తున్న ఇరవై మంది పారిశుద్ధ్య కార్మికులను సోమవారం తెలంగాణ ఉద్యమకారుడు, బీజేపీ నాయకుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ సన్మానించి దసరా కానుకగా పది వేల రూపాయల నగదు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులు జడల పెద్ద నర్సింహయాదవ్, మేడి యాదయ్య, పాల లక్ష్మయ్య, పోకల ముత్తయ్య, మేడి శేఖర్, జడల నర్సింహ, రుద్రవరం నర్సింహ, జిట్ట దుర్గేష్, జిట్ట నరేష్, మల్లేష్, శంకర్, స్వామి, నాగిరెడ్డి, పాండు, శంకర్, కిషన్ పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు



సభ్యత్వం అందజేస్తున్న మొగిలయ్య

నకిరేకల్ : పట్టణంలో బీజేపీ ఆధ్వర్యంలో 220, 221 బూత్‌ల పరిధిలో సోమవారం సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ నకిరేకంటి మొగిలయ్య ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు మండల వెంకన్న, గుడుగంట్ల సాయన్న, గర్రె మురళి, బండ మధుకర్‌రెడ్డి, కొండేటి శ్రీను, పందాల సైదులు, యానాల శ్రీనివాస్‌రెడ్డి, రాచకొండ గోపి పాల్గొన్నారు.

కార్మిక విభాగం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కత్తుల వీరన్న



కేతేపల్లి : ఉమ్మడి నల్లగొండ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్మిక విభాగం అధ్యక్ష, ఉపాధ్యక్షులుగా కేతేపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన కత్తుల వీరన్న, పల్నాటి గోవర్ధన్‌రెడ్డి నియమితులయ్యారు. ఈమేరకు సోమవారం హైదరాబాద్‌లోని గాంధీ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో టీపీసీసీ కార్మిక విభాగం రాష్ట్ర చైర్మన్ కౌసల్ సమీర్ సంఘం ఉమ్మడి జిల్లా నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ప్రధాన కార్యదర్శిగా సిద్దోజు రమేష్‌చారి, కార్యదర్శిగా పి.అంబేద్కర్, సహాయ కార్యదర్శిగా బొజ్జ మారయ్య నియమితులయ్యారు.

సియోను ఉత్సవాలు

నకిరేకల్ : పట్టణంలోని మినీ స్టేడియంలో వేదగ్రీస్ మినిస్ట్రీ వారి ఆధ్వర్యంలో సియోను ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో కాంగ్రెస్ నేత దైద రవీందర్ పాల్గొని క్రైస్తవులను ఉద్దేశించి మాట్లాడారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు

నల్లగొండ క్రైం: నల్లగొండ పట్టణంలో సోమవారం రాత్రి టూటౌన్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులు వేర్వేరుగా వాహనదారులను ఆపి డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు నిరంతరం డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

నిందితుడి అరెస్ట్

చండూరు: మండలం పరిధిలోని ఓ గ్రామంలో బాలికపై ఆదివారం రాత్రి లైంగిక దాడి చేసిన నిందితుడిని సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. బాలిక తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఒంగోలు రూరల్ దేవరంపాడుకు చెందిన వాటుపల్లి బాబీని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు పంపినట్లు సీఐ వెంకట్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

14న బహిరంగ వేలం

రామగిరి(నల్లగొండ): పట్టణంలోని తులసీనగర్ భక్తాంజనేయ స్వామి ఆలయంలో కొబ్బరి కాయలు, పూజా సామగ్రి విక్రయించేందుకు ఈ నెల 14వ తేదీన బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ కె.కుశలయ్య సోమవారం తెలిపారు. ఆసక్తి గలవారు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

పనులు సరే.. బిల్లులు ఏవీ !

- తిప్పర్తి మండలంలో 17 గ్రామ పంచాయతీ భవనాలు మంజూరు
- రెండేళ్ల క్రితం ఐదు భవనాల నిర్మాణాలు పూర్తి
- కాంట్రాక్టర్లకు నేటికీ అందని బిల్లులు



కాశివారిగూడెం గ్రామ పంచాయతీ భవనం



నిర్మాణంలో ఉన్న జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ భవనం

తిప్పర్తి : మండలంలోని పలు గ్రామాల్లో నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణం పూర్తయినప్పటికీ కాంట్రాక్టర్లకు బిల్లులు అందడం లేదు. బిల్లుల కోసం అధికారుల చుట్టూ తిరుగున్నా త్వరలో వస్తాయనే సమాధానం చెబుతున్నారు కానీ రెండేళ్లుగా బిల్లులు మాత్రం మంజూరు చేయడం లేదు. దీంతో పంచాయతీ భవనాల నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

2022లో మంజూరు

ప్రజలకు చేరువగా మెరుగైన పాలన అందించాలనే ఉద్దేశంతో గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2018వ సంవత్సరంలో ఆవాస గ్రామాలను నూతన గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేసింది. అందులో భాగంగా ఉపాధి హామీ పథకం ద్వారా నూతన గ్రామపంచాయతీల భవనాలను 2022వ సంవత్సరంలో మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ. 20 లక్షల చొప్పున కేటాయించారు. తిప్పర్తి మండలంలో 26 గ్రామపంచాయతీలు ఉండగా అందులో పాతవి, కొత్తవి కలిపి 17 గ్రామపంచాయతీలకు నూతన భవనాలను ప్రభుత్వం మంజూరు చేసింది.

మిగతా గ్రామాల్లో నత్తనడకన పనులు

తిప్పర్తి మండలంలోని కాశివారిగూడం, రాయినిగూడెం, ఆరెగూడం, గంగన్నపాలెం, జొన్నగడ్డలగూడెం గ్రామపంచాయతీల్లో నూతన భవనాలను నిర్మించారు. పూర్తయిన భవనాలను గ్రామ పంచాయతీ పాలకవర్గానికి అప్పగించారు. వాటిని ప్రారంభించారు కూడా. అయితే పూర్తయిన భవనాలకు బిల్లులు రాని కారణంగా ఇండ్లూరు, రామలింగాలగూడం, దుప్పలపల్లి, సోమోరిగూడం, వెంకటాద్రిపాలెం, యాపలగూడెం, మామిడాల, గడ్డికొండారం, కంకణాలపల్లి, గోదోరిగూడం, జంగారెడ్డిగూడెం గ్రామాల పంచాయతీ భవనాల నిర్మాణ పనులు నత్తనడకన నడుస్తున్నాయి. అంతయ్యగూడెంలో భూమి సమస్య కారణంగా నిర్మాణ పనులు మొదలు పెట్టలేదు.

పెరుగుతున్న వడ్డీల భారం

తిప్పర్తి మండలంలోని ఐదు గ్రామాల పంచాయతీ భవనాలు పూర్తయి సుమారు రెండు సంవత్సరాలు గడుస్తున్నా నేటికీ బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అప్పు చేసి భవనం నిర్మాణం చేపట్టామని, నేటివరకు బిల్లు రాకపోవడంతో అప్పులకు వడ్డీలు ఎక్కువ అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పులు చేసి ఇబ్బందులపాలు అవుతున్నామని, అప్పులకు వడ్డీలు పెరిగిపోతున్నాయని వారు పేర్కొంటున్నారు. ప్రభుత్వం స్పందించి పూర్తయిన గ్రామపంచాయతీ భవనాలకు నిధులు మంజూరు చేయాలని కోరుతున్నారు.

రెండు సంవత్సరాలు గడిచింది



కాశివారిగూడం గ్రామంలో ఉపాధిహామీ నిధులు రూ.20 లక్షలతో నూతన గ్రామ పంచాయతీ భవనాన్ని గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో నిర్మించా. రెండు సంవత్సరాలు గడుస్తున్నా బిల్లులు మాత్రం రావడంలేదు. అధికారులను అడిగితే నిధులు త్వరలో వస్తాయని చెబుతున్నారు. బిల్లులు త్వరగా వస్తాయనే ఆశతో అప్పులు చేసి పంచాయతీ భవన నిర్మాణం చేపట్టా. అప్పులకు వడ్డీ పెరిగిపోతోంది. ప్రభుత్వం స్పందించి బిల్లులు మంజూరు చేయాలి

–ఎస్‌కే బషీర్, కాశివారిగూడం

నేటికీ బిల్లు రాలేదు



జంగారెడ్డిగూడెం గ్రామపంచాయతీకి రాయినిగూడెం గ్రామం ఆవాస గ్రామంగా ఉండేది. బీఆర్ఎస్ ప్రభుత్వం మా గ్రామాన్ని నూతన గ్రామపంచాయతీ గా ఏర్పాటు చేయడంతోపాటు నూతన పంచాయతీ భవనం మంజూరు చేసింది. మా గ్రామంలో నూతన పంచాయతీ భవనం నిర్మించి సంవత్సరం గడుస్తోంది. నేటికీ బిల్లు రాలేదు. దీంతో చాలా ఇబ్బంది పడుతున్నాం. ప్రభుత్వం వెంటనే స్పందించి బిల్లులు మంజూరు చేసి ఆదుకోవాలి.

–మైనం నాగయ్య, మాజీ సర్పంచ్ రాయినిగూడెం

త్వరలో నిధులు విడుదల అవుతాయి

తిప్పర్తి మండలంలో నూతన పంచాయతీ భవనాలు 17 మంజూరు కాగా అందులో ఐదు భవనాల నిర్మాణం పూర్తయింది. ఉపాధి హామీ పథకం నిధుల విడుదలలో కొంత ఆలస్యం జరిగింది. త్వరలో బిల్లులు పాస్ అవుతాయి. మిగిలిన భవనాలు నిర్మాణ పనులు జరుగుతున్నాయి.

– శ్రీనివాస్, పంచాయతీరాజ్ ఏఈ, తిప్పర్తి

హామీల అమలుపై చిత్తశుద్ధిలేని కాంగ్రెస్

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



ధర్నాలో మాట్లాడుతున్న నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

చిట్యాల: రైతులకు ఇచ్చిన హామీల అమలుపై కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రూపాయల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ చిట్యాల తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాలో చిరుమర్తి లింగయ్య పాల్గొని మాట్లాడుతూ రైతులందరికీ రెండు లక్షల రుణమాఫీ ఒకేసారి చేస్తామని, రైతు భరోసా అందజేస్తామని, వరి పంటకు బోనస్ అందజేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన కాంగ్రెస్ పార్టీ.. అధికారంలోకి వచ్చిన తరువాత అమలు చేయడంలో విఫలమైందన్నారు. రుణాలను మాఫీ చేయకుండా రకరకాల షరతులతో బ్యాంకుల చుట్టూ, తహసీల్దార్ కార్యాలయాల చుట్టు రైతులను తిప్పుతూ ప్రభుత్వం ఇబ్బందులకు గురిచేస్తోందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన పది నెలల కాలంలో రెండు వ్యవసాయ సీజన్లు పూర్తయినప్పటికీ రైతు భరోసా ఇవ్వలేదని విమర్శించారు. రైతుల పక్షాన ప్రశ్నిస్తున్న బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీష్‌రావుపై హైదరాబాద్‌లో, ఖమ్మంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు దాడులకు పాల్పడిన విషయాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇళ్లు కూల్చే కార్యక్రమాలను చేపడుతోందని, దీంతో ప్రజల్లో ఆ పార్టీపై వ్యతిరేకత మొదలైందన్నారు. అసభ్య పదజాలంతో ఆరోపణలు చేస్తున్న మంత్రి సురేఖను వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ కృష్ణ నాయక్‌కు బీఆర్ఎస్ నాయకులతో కలిసి చిరుమర్తి లింగయ్య వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కూరెళ్ల లింగస్వామి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆవుల అయిలయ్య, చిట్యాల పట్టణ అధ్యక్షుడు పొన్నం లక్ష్మయ్యగౌడ్, కార్మిక విభాగం అధ్యక్షుడు కొలను సతీష్‌గౌడ్, మాజీ ఎంపీటీసీలు పెద్దబోయిన సత్తయ్య, దేవరపల్లి సత్తిరెడ్డి, గొలనుగొండ దశరథ, నాయకులు సుంకరి యాదగిరి, వెంకటేష్‌గౌడ్, రమేష్‌రెడ్డి, కిష్టయ్య, బోయపల్లి శ్రీనివాస్‌గౌడ్, నాగరాజురెడ్డి, శ్రీశైలం, అశోక్, నరేందర్‌రెడ్డి, జలంధర్‌రెడ్డి, భిక్షంరెడ్డి, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఎంబీబీఎస్ సీట్లు సాధించిన మోడల్ స్కూల్ పూర్వ విద్యార్థులు

మర్రిగూడ : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో విద్యనభ్యసించిన పలువురు పూర్వ విద్యార్థులు నీట్‌లో ఉత్తీర్ణత సాధించి ఎంబీబీఎస్‌తోపాటు ఎంఎస్సీ ఫిజిక్స్‌లో సీట్లు సాధించారు. చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన నాగిళ్ల యశ్వంత్‌సాయి 2019–20 విద్యా సంవత్సరంలో మర్రిగూడ ప్రభుత్వ ఆదర్శ పాఠశాలలో పదో తరగతి పూర్తి చేశారు. అనంతరం ఇంటర్ ఇతర చోట చదివి ఎంబీబీఎస్ సీటు సాధించాడు. మర్రిగూడ మండలంలోని కమ్మగూడ గ్రామ పంచాయతీ పరిధిలోగల భోజ్యాతండాకు చెందిన రమావత్ సన్ని 2018–19 సంవత్సరంలో పదో తరగతి పూర్తి చేశాడు. ఇంటర్ ఇతర చోట చదివి ఎంబీబీఎస్ సీటు సాధించారు. అదేవిధంగా చండూరు మండలం నెర్మట గ్రామానికి చెందిన నాగిళ్ల పవన్ సాయి 2018–19 సంవత్సరంలో పదో తరగతి పూర్తిచేశాడు. ప్రస్తుతం ఉస్మానియాలో ఎంఎస్సీ ఫిజిక్స్‌లో 4వ ర్యాంకు ఉత్తీర్ణత సాధించారు. నెర్మటకు చెందిన పవన్‌సాయి, యశ్వంత్‌సాయి ఇద్దరు అన్నదమ్ముల్లు కావడం విశేషం. పూర్వ విద్యార్థులు పలు సీట్లు సాధించడంపై పాఠశాల ప్రిన్సిపాల్ ఎస్.శివస్వరూపరాణి, పూర్వ అధ్యాపక బృందం విద్యార్థులను అభినందించారు.

• పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు , ఉపాధ్యాయులు

కనగల్: జీ ఎడవెల్లి ఉన్నత పాఠశాలలో 1998–99 విద్యా సంవత్సరంలో ఎస్సెస్సీ చదివిన విద్యార్థులు సోమవారం ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. అప్పటి ఉపాధ్యాయులు పాండురయ్య, మోహన్‌రెడ్డి, యాదగిరి, లక్ష్మారెడ్డి, నాగయ్యలను శాలువా కప్పి ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు బండమీది రాము, జయసింహ, వెంకన్న, రొయ్య కిరణ్, పానుగుండ్ల శంకర్, ఏ శేఖర్, సరిత, మరుధ్వతి, వింధ్య పాల్గొన్నారు.

సూచిక బోర్డులు లేక వాహనదారుల అవస్థలు !

- హైదరాబాద్– విజయవాడ రహదారిపై గందరగోళానికి గురవుతున్న ప్రయాణికులు
- కామినేని ఆస్పత్రి వరకు వెళ్లి వెనకకు వస్తున్న వైనం



నార్కట్‌పల్లి ఫ్లైఓవర్ సమీపంలో సూచిక బోర్డు ఏర్పాటు చేయాల్సిన ప్రదేశం

నార్కట్‌పల్లి : జాతీయ రహదారిపై నార్కట్‌పల్లి మండల కేంద్రం సమీపంలో సూచిక బోర్డులు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హైదరాబాద్ వైపు నుంచి నార్కట్‌పల్లి సమీపంలోకి రాగానే విజయవాడ, నల్లగొండ, గుంటూరు వైపు వెళ్లే వాహనదారులు గందరగోళానికి గురవుతున్నారు.

గతంలో సూచిక బోర్డులు ఏర్పాటు

హైదరాబాద్–విజయవాడ జాతీయ రహదారి విస్తరణ సమయంలో రోడ్డుకు ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంతో వాహనదారుల ప్రయాణం సులువుగా కొనసాగేది. రోడ్డుకు ఇరువైపులా వివిధ గ్రామాలకు వెళ్లే సూచిక బోర్డులను గతంలో జీఎంఆర్ సంస్థ ఏర్పాటు చేసింది. అనంతరం అవి శిథిలావస్థకు చేరుకుని గుర్తుపట్టకుండా మారాయి. జాతీయ రహదారిపై ఫ్లైఓవర్ దగ్గర సూచిక బోర్డులు సరిగ్గా గుర్తుపట్టే పరిస్థితి లేకుండా పోయింది.

దాదాపు రెండు కిలోమీటర్లు ముందుకు వెళ్లి..

హైదరాబాద్–విజయవాడ రహదారిలో భాగంగా మార్గమధ్యలో నార్కట్‌పల్లి వద్ద గల ఫ్లైఓవర్ సమీపంలో నల్లగొండ, గుంటూరు వైపు వెళ్లే వాహనదారులు రూటు మారాల్సి ఉంటుంది. అయితే నార్కట్‌పల్లి వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కొందరు ఫ్లైఓవర్ పైకి వెళ్లి తిరిగి వస్తున్నారు. నలగొండ, గుంటూరు వైపు వెళ్లేవారు రాత్రి సమయంలో కామినేని ఆస్పత్రి వరకు వెళ్లిన తర్వాత నార్కట్‌పల్లి వచ్చినట్లు గమనించి తిరిగి దాదాపు రెండు కిలోమీటర్లు వెనుకకు వస్తున్నారు. ఈ రోడ్డుపై సంబంధిత అధికారులు ప్రయాణిస్తున్నా పట్టించుకోకపోవడం గమనార్హం. దసరా పండుగ సందర్భంగా హైదరాబాద్ నుంచి మిర్యాలగూడెం వైపు వెళ్లే వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు ఏర్పడే అవకాశం ఉంది. నార్కట్‌పల్లి వద్ద సూచిక బోర్డు ఏర్పాటు చేసి సమస్య పరిష్కరించాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి



హైదరాబాద్ నుంచి గుంటూరు వెళ్లే మార్గంలో నార్కట్‌పల్లి సమీపంలో ఉన్న ఫ్లైఓవర్ వద్ద సూచిక బోర్డు లేకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. సంబంధిత అధికారులు పరిశీలించి ఫ్లైఓవర్ సమీపంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలి. టోల్‌గేట్ వద్ద డబ్బులు వసూలు చేసే శ్రద్ధ.. రోడ్డుకు ఇరువైపులా సూచిక బోర్డులు ఏర్పాటు చేయడంలో లేదు.

- శ్రీధర్‌రెడ్డి, స్థానికుడు

నాణ్యతప్రమాణాలు పాటించాలి

నల్లగొండ టౌన్: పట్టణ శివారు ప్రాంతంలో నిర్మిస్తున్న అండర్‌గ్రౌండ్ డ్రైయినేజీ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సీపీఎం నల్లగొండ పట్టణ కార్యదర్శి ఎండీ. సలీం డిమాండ్ చేశారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని 18,19 వార్డుల సీపీఎం శాఖ మహాసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కృష్ణా జలాలు పట్టణంలో ప్రతిరోజూ వచ్చేలా చూడాలన్నారు. నల్లగొండ పట్టణంలో కుక్కల బెడద నివారించాలన్నారు. ఈ సమావేశంలో దండంపల్లి సత్తయ్య, కోట్ల అశోక్‌రెడ్డి, పంచలింగం, కందుల అశోక్, రాంరెడ్డి, వెంకట్‌రెడ్డి, సుందరయ్య, జానయ్య, అంజయ్య, సురేష్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న నవరాత్రి ఉత్సవాలు



నకిరేకల్ : సాయి మందిరంలో చండీ హోమం



నల్లగొండ పట్టణంలోని సావర్కర్‌నగర్ వద్ద..



నల్లగొండలోని 13వ వార్డులో అన్నదానంలో పాల్గొన్న భక్తులు, భవానీ స్వాములు



నల్లగొండ పట్టణంలోని వైకుంఠనగర్ కాలనీలో..



కట్టంగూర్ : మునుకుంట్లలో పూజలో పాల్గొన్న వివేకానంద యూత్ సభ్యులు



నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్జాలబావి మండపంలో..



నల్లగొండ టూటౌన్ : పూజలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి

డీజేలపై నిషేధం తొలగించాలని ధర్నా



ధర్నా చేస్తున్న డీజే సౌండ్ దుకాణాల యజమానులు

నల్లగొండ: ప్రభుత్వం డీజే సౌండ్ సిస్టంపై నిషేధాన్ని తొలగించాలని కోరుతూ సోమవారం జిల్లాలోని అన్ని నియోజకవర్గాల నుంచి వచ్చిన డీజే సౌండ్ దుకాణాల యజమానులు గడియారం సెంటర్ నుంచి కలెక్టరేట్ వద్ద ర్యాలీ నిర్వహించి ధర్నా చేశారు. అనంతరం కలెక్టర్ నారాయణరెడ్డికి వినతి పత్రం అందజేశారు. నిషేధం వల్ల జిల్లా పరిధిలో సుమారు 800 కుటుంబాలు రోడ్డున పడాల్సిన దుస్థితి వచ్చిందని కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు కత్తుల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు మల్లికార్జున్, మధు, సీహెచ్ విజయ్‌కుమార్, సైదులు, శ్రీనివాస్, నందు తదితరులు పాల్గొన్నారు.

గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలి



మాట్లాడుతున్న లింగమల్లు

రామగిరి(నల్లగొండ): గురుకులాలకు పక్కా భవనాలు నిర్మించాలని ధర్మ టీచర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పాక లింగమల్లు యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల ఆశయాలకు అనుగుణంగా విద్యను ప్రజాస్వామీకరించాలన్నారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి ఓపీఎస్ విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఎస్జీటీలకు ఓటు హక్కు కల్పించాలన్నారు. 317 జీఓ బాధితులందరికీ న్యాయం చేయాలన్నారు. పీఆర్సీ రిపోర్టును, ఐదు డీఏలను వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జిల్లా కన్వీనర్ బొంగరాల నాగయ్య అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి మామిడి శంకర్, యాదాద్రి జిల్లా కన్వీనర్ ఎర్ర సుధాకర్, కో కన్వీనర్ నగేష మహారాజ్, పేర్ల వెంకటేశ్వర్లు, కత్తుల సుధాకర్, పేర్ల డేవిడ్, తక్కెళ్లపల్లి వెంకటేశ్వర్లు, ఎరోళ్ల యాదగిరి, సైదులు, శ్రీనివాస్, రఘుపతి పాల్గొన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి

చండూరు : మండలంలో పదేళ్లలోపు బాలికపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని అమ్మ ఉమెన్స్ అండ్ చైల్డ్ ప్రొటెక్షన్ ఫౌండేషన్ చైర్మన్ బరిగెల ఉమా అధికారులను డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ప్రతిరోజు ఏదో ఒక ప్రాంతంలో ఇలాంటి ఘటనలు చోటు చేసుకుంటున్నాయన్నారు. నిందితులకు చట్టపరమైన కఠిన శిక్షలు వేయకపోవడంతో ఇలాంటి సంఘటనలు మితిమీరుతున్నాయన్నారు.

ఆరెకంటి శ్రీనివాస్‌కు నివాళి

నల్లగొండ టౌన్: ఎమ్మార్పీఎస్ ఉమ్మడి నల్లగొండ జిల్లా మాజీ అధ్యక్షుడు, ఎలక్ట్రికల్ ఇంజనీర్ ఆరెకంటి శ్రీనివాస్ ఆదివారం అనారోగ్యంతో మృతి చెందాడు. సోమవారం ఆయన మృతదేహాన్ని ఎమ్మార్పీఎస్ నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. బకరం శ్రీనివాస్, మల్లెపాక వెంకన్న, కొమిరె స్వామి, కందుల మోహన్, దేవయ్య, నవీన్, రాము, పి.శ్రీనివాస్, సత్యనారాయణ, చేకూరి గణేశ్, ముదికొండ వెంకటేశ్వర్లు, నారపాక అంజి పాల్గొన్నారు.

పాత బస్తీలో మిషన్ పరివర్తన్

నల్లగొండ క్రైం: మిషన్ పరివర్తన్ కార్యక్రమంలో భాగంగా నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధి పాతబస్తీలో సోమవారం కాలనీవాసులకు కళాబృందం సభ్యులు మాదక ద్రవ్యాల వాడకం వల్ల జరిగే అనర్థాలపై పాటల రూపంలో వివరించారు. ఈ సందర్భంగా వన్‌టౌన్ సీఐ ఎ.రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కాలనీ వాసులకు గంజాయి సమాచారం తెలిస్తే 100కు ఫోన్ చేయాలని సూచించారు. వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సురేష్, పోలీసులు, కళాబృందం సభ్యులు, కౌన్సిలర్లు వట్టిపల్లి శ్రీనివాస్, ఎడ్ల శ్రీను, దండంపల్లి సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రాజశేఖర్‌రెడ్డి